క్లుప్తంగా

వృద్ధులకు దుస్తులు పంపిణీ



వృద్ధులకు దుస్తుల పంపిణీ

పోరుమామిళ్ల : పోరుమామిళ్లకు చెందిన ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, చిత్తా తోమాస్‌రెడ్డి దంపతులు గురువారం 120 మంది వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. టేకూరుపేట ప్రాంతంలోని వృద్ధులకు అక్కడి పునీత జోజప్ప దేవాలయంలో సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్ రెడ్డి, ప్రసాదరెడ్డి దుస్తులు అందచేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఫౌండేషన్ అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నదని, పండుగ సమయాల్లో వృద్ధులకు దుస్తుల పంపిణీ చేపట్టామన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు



బహుమతులు పొందిన విద్యార్థులతో ఏకల్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

చాపాడు : మండల పరిధిలోని నక్కలదిన్నె ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం కడప జై శ్రీరామ్ ఏకల్ అభియాన్, ప్రొద్దుటూరు సంచ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సోమల మహేశ్వర్ రెడ్డి సహకారంతో విద్యార్థులకు ఖేల్ ఖుద్ ఆటల పోటీలు నిర్వహించినట్లు కడప అంచల్ మహిళా ఉపాధ్యక్షురాలు రమాదేవి తెలిపారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శోభన్, ప్రశిక్షణ ప్రముఖ్ వెంకట సుజన, సంచ్ అధ్యక్షులు వేమన్నారాయణ, నక్కలదిన్నె మాతాజీలు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ



పతకాలు అందుకున్న పోరుమామిళ్ల విద్యార్థులు

పోరుమామిళ్ల : ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో ఈనెల 1 నుండి 3 వరకు జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పోరుమామిళ్ల విద్యార్థులు సత్తా చాటారు. మాస్టర్ నాయబ్‌రసూల్ నేతృత్వంలో పోటీల్లో పాల్గొన్న నలుగురు క్రీడాకారుల్లో సబ్‌జూనియర్స్ విభాగంలో నదీష్ బంగారు పతకం సాధించగా, కాడెట్ విభాగంలో అబూబకర్ కాంస్య పతకాన్ని సాధించాడు. జిల్లా తైక్వాండో అధ్యక్షులు శివశంకర్‌రెడ్డి అభినందించారని మాస్టర్ నాయబ్ రసూల్ తెలిపారు. కోచ్‌గా సుభాష్ వ్యవరించారన్నారు.

పరామర్శ

ప్రొద్దుటూరు : స్థానిక 35వ వార్డు సచివాలయ కన్వీనర్ కాటం రవి గుండె ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గురువారం రవి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పిట్టా బాలాజీ, మాజీ కౌన్సిలర్ పిట్టా భద్రమ్మ, టౌన్ బ్యాంకు డైరెక్టర్ గోదెన గంగాధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రీడా పోటీలలో వైఫల్యాలు విజయానికి పునాదులు

చాపాడు : క్రీడా పోటీలలో వైఫల్యాలు విజయానికి పునాదులు అవుతాయని.. ఓటమికి కుంగిపోవడం విజయానికి పొంగిపోవడం మంచిది కాదని డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పల్లవోలు వద్ద ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన వార్షిక క్రీడా సమ్మేళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాలల్లో చదువుతో పాటు క్రీడలకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. పాఠశాల చైర్మన్ వి.జయచంద్రారెడ్డి మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థులలో పోటీతత్వం పెరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి పోటీలలో పాల్గొనాలని సూచించారు. అనంతరం విద్యార్థులు వివిధ రకాలైన క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సీబీఐటీ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులరెడ్డి, పాఠశాల డైరెక్టర్ లోహిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (న్యాక్)లో సీడాప్, ఏపీఎస్ఎస్‌డీసీ సంయుక్త సహకారంతో సర్వేయర్, సోలార్ పి.వి.ఇంజనీర్, ఫీల్డ్ ఇంజనీర్ కోర్సులలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతో కూడిన ఉపాధి కల్పించనున్నట్లు న్యాక్ అకాడమి కన్‌స్ట్రక్షన్స్ ఆఫీసర్ రాకేష్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ కోర్సులలో శిక్షణ పొందేందుకు 18 ఏళ్ల నుంచి 30 ఏళ్లలోపు వయసు ఉండాలన్నారు.

హమ్మయ్యా.. 16 ఏళ్ల సమస్య తీరింది

- ఇనాం భూముల సమస్యతో ఆగిన రిజిస్ట్రేషన్లు
- ప్రభుత్వం చొరవతో జీఓ జారీ
- ప్రజలకు ఊరట



ప్రొద్దుటూరులోని వైఎంఆర్ కాలనీ ముఖద్వారం

ప్రొద్దుటూరు : ప్రభుత్వం చొరవతో 16 ఏళ్ల సమస్య పరిష్కారం కానుంది. ప్రభుత్వం జారీ చేసిన జీఓపై ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రొద్దుటూరు పట్టణ నడిబొడ్డున ఉన్న వైఎంఆర్ కాలనీకి సంబంధించి 311, 315 సర్వే నంబర్లలో సుమారు 32 ఎకరాల విస్తీర్ణంలో విలువైన ఇళ్లు నిర్మించుకుని ఉన్నారు. అనధికారికంగా మార్కెట్ రేటు సెంటు విలువ రూ.20 లక్షల నుంచి రూ.50లక్షలు పలుకుతోంది. అయినా ఇక్కడి స్థలాలతోపాటు ఇళ్లు రిజిస్ట్రేషన్లకు నోచుకోవడం లేదు. ఈ ప్రకారం ప్రొద్దుటూరు మండల పరిధిలో 9 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి సుమారు 500 ఎకరాల భూమి ఉంది. ఇవి ఇనాం భూములు కావడంతో 2007లో ప్రభుత్వం రిజిస్ట్రేషన్లను నిలిపివేసింది. నాటి నుంచి నేటి వరకు ఇక్కడ రిజిస్ట్రేషన్లు జరగడం లేదు.

■ ప్రొద్దుటూరు మున్సిపాలిటీతోపాటు పెద్దశెట్టిపల్లె, దొరసానిపల్లె, బొల్లవరం, ప్రొద్దుటూరు, కామనూరు, ఉప్పరపల్లె, తాళ్లమాపురం, కొత్తపల్లె, రామేశ్వరం రెవెన్యూ గ్రామాల పరిధిలో ఈ సమస్య ఉంది. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ అవసరాల కారణంగా పలువురు తమ ఇళ్లు, స్థలాలను అమ్మేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. విలువైన ఆస్తులు కావడంతో అగ్రిమెంట్లకు కొనుగోలుదారులు అంగీకరించడం లేదు. ఇదిలావుండగా ప్రభుత్వం ఈ ఏడాది జూలై 19వ తేదీన జీఓ ఎంఎస్ నంబర్ 310 జారీ చేసింది. ఈ ప్రకారం మంగలి, చాకలి, కుమ్మర, వడ్రంగి, మాదిగలకు సంబంధించిన సర్వీసు ఇనాం భూములను రెగ్యులర్ చేసేందుకు అవకాశం ఏర్పడింది. ప్రభుత్వ జీఓ మేరకు మండల రెవెన్యూ అధికారులు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. అతి త్వరలో మిగతా వాటిలాగే ఈ భూములు కూడా రిజిస్ట్రేషన్‌కు నోచుకోనున్నాయి.

చుక్కల భూములకు కూడా పరిష్కారం లభించింది

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే చుక్కల భూములకు కూడా పరిష్కారం లభించింది. ఏళ్ల తరబడి చుక్కల భూములను రైతులు సాగు చేసుకుంటున్నా అధికారికంగా రికార్డుల్లో నమోదు కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవలే ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించడంతో మండల పరిధిలో సుమారు 1000 ఎకరాల చుక్కల భూములకు విముక్తి లభించింది. రైతులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాం



సర్వీసు ఇనాం భూములను రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం ఇటీవల జీఓ మంజూరు చేసింది. ఆ ప్రకారం ప్రొద్దుటూరు మండలానికి సంబంధించి కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపడం జరిగింది. అక్కడి నుంచి అనుమతులు వచ్చిన వెంటనే మిగతా వాటిలాగే సర్వీసు ఇనాం భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు.

- నజీర్ అహ్మద్, తహసీల్దార్, ప్రొద్దుటూరు

చాలా ఇబ్బందులు పడుతున్నారు



వైఎంఆర్‌కాలనీలో ఇల్లు, స్థలాలు రిజిస్ట్రేషన్‌కు నోచుకోక అమ్మకం దారులు ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ అవసరాల కోసం వాటిని అమ్మేందుకు సిద్ధంగా ఉన్నా ప్రభుత్వ నిబంధనల కారణంగా ఇంత వరకు రిజిస్ట్రేషన్ కాలేదు. కొత్తగా ప్రభుత్వం ఇచ్చిన జీఓ ప్రకారం రిజిస్ట్రేషన్ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీని వలన ఇబ్బందులు తొలగనున్నాయి.

- వరికూటి ఓబుళరెడ్డి, 4వ వార్డు కౌన్సిలర్

ఘనంగా కార్తీక మాస ఉత్సవాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధి దొరసానిపల్లెలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో గురువారం కార్తీకమాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చన చేసి దేవతా మూర్తులను అలంకరించారు. శుక్రవారం ఉదయం లక్ష్మీగణపతి హోమం, సుదర్శన హోమం, సాయంత్రం గౌరీవ్రతం, శనివారం సుప్రభాత సేవ, దేవతా మూర్తులకు పంచామృతాభిషేకం, రాత్రి చెక్కభజన, కర్రసాముల మధ్య గౌరమ్మ– గొంతెమ్మలకు ఊరేగింపు, ఉద్వాసన, రాత్రి 12 గంటలకు సీతారామాంజనేయస్వామి రథయాత్ర నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

ఎస్ఎఫ్ఐ కృషి అభినందనీయం

పోరుమామిళ్ల : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ చేస్తున్న కృషి అభినందనీయమని ఆప్కాస్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి అన్నారు. గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి మండల సభ్యులతో కలసి డాక్టర్ కళ్యాణ చక్రవర్తిని మర్యాద పూర్వకంగా కలసి శాలువా, పూల దండతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కరిష్మా, సంస్థ సభ్యులు చారి, ప్రేమ్, విజయభాస్కర్, వంశీ, గీత, మహాలక్ష్మి పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించాలి



కూనవారిపల్లెలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రాజుపాళెం: వెలవలి గ్రామంలో నేలవాలిన వరి పంట

ఖాజీపేట : తుపాన్ కారణంగా దెబ్బతిన్న రైతులను ఆదుకుని వారికి పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులకు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డిలు విజ్ఞప్తి చేశారు. మండలంలో పుల్లూరు, కూనవారిపల్లె పంచాయతీల్లో తుపాన్ కారణంగా దెబ్బతిన్న వరి, మినుము పంటలను వారు పరిశీలించి రైతులతో మాట్లాడి పంటనష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌లో వరికి మంచి ధర ఉన్నా వర్షం కారణంగా దిగుబడి తగ్గిపోయిందన్నారు. ప్రభుత్వం తరుపున రైతులకు పరిహారం అందించి ఆదుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కూనవారిపల్లె సర్పంచ్ భూమన సుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నేలవాలిన వరి

రాజుపాళెం : మిచాంగ్ తుపానుతో వరిపంట నేలవాలింది. దాదాపు 115 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. అలాగే ఈదురు గాలులకు పత్తి, కంది, అక్కడక్కడ జొన్న పంటలు ఓ వైపు వాలాయి. ఈ మేరకు ఆయా గ్రామాల్లోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు దెబ్బతిన్న పంటలను పరిశీలించి నివేదిక తయారు చేశారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

దువ్వూరు : జిల్లాలో మిచాంగ్ తుపాను వల్ల నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కడప జిల్లాలోని పలు ప్రాంతాల్లో పంటలపై తీవ్ర ప్రభావం చూపిందని ఆయన తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు పంటలను పరిశీలించి నష్టం అంచనాలను వేస్తున్నారని, రైతులు ఎవరు అధైర్యపడవద్దని, ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. రైతులకు పంట నష్టపరిహారం చెల్లించడంతోపాటు తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ఆయన రైతులకు భరోసా ఇచ్చారు.

ప్రభుత్వం చేసిన లబ్ధిని ప్రజలకు వివరించాలి

చాపాడు : గ్రామ వలంటీర్లు, గృహ సారథులు నాలుగేళ్లలో ప్రభుత్వం చేసిన లబ్ధిని ప్రజలకు వివరించాలని మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య తెలిపారు. మండలంలోని ఎన్.ఓబాయపల్లె(నక్కలదిన్నె) గ్రామ సచివాలయ పరిధిలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో, నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యత్యాసాన్ని బేరీజు వేస్తూ లబ్ధిదారులకు వివరించాలన్నారు. వలంటీర్లకు మా నమ్మకం నువ్వే జగనన్న మెటీరియల్‌ను పంపిణీ చేశారు. అనంతరం సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ఆవిష్కరించి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ అంజనమ్మ, ఎంపీటీసీ ఈశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి

పోరుమామిళ్ల: రాష్ట్రంలో గత నాలుగున్నర సంవత్సరాల్లో సంక్షేమం, అభివృద్ధిలో ముందుకు పోయిందని, ఎన్నికల ముందు చెప్పిన హామీలు 99 శాతం జగనన్న అమలు చేశారని, ఇచ్చిన హామీలే కాక ఇవ్వనివి కూడా అమలు చేశారని జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సీఎం బాషా పేర్కొన్నారు. గురువారం తిమ్మారెడ్డిపల్లె సచివాలయం వద్ద జరిగిన 'మళ్లీ జగనన్నే ఎందుకు' కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా లబ్ధిదారుల అకౌంటుకే నేరుగా జమ అవుతున్న విషయం మీకు తెలిసిందే అన్నారు.



నక్కలదిన్నెలో జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

అందుకే మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిగా ఎన్నుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీవ్‌బాషా, సర్పంచ్, ఎంపీడీఓ వరప్రసాదరావు, వలంటీర్లు, గృహసారథులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రాజుపాళెం : వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుద్దేటి రాజారాంరెడ్డి తెలిపారు. ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం మండలంలోని టంగుటూరు గ్రామంలో గురువారం నిర్వహించారు. సచివాలయం వద్ద సంక్షేమ పథకాల సూచిక బోర్డును రాజారాంరెడ్డి, మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, సోమేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గోనా వెంకటసుబ్బారెడ్డి, పార్టీ నాయకుడు ముడియం గౌతమ్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాజారాంరెడ్డి మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఈ గ్రామానికి రూ.41,46,54,000 వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. రాబోయే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ సీఎం చేయాలని, ఎంపీగా అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యేగా రాచమల్లు శివప్రసాదరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రఘురామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రంగారెడ్డి, మహేష్ రెడ్డి, నరసింహారెడ్డి, నవనీధర్ రెడ్డి, దస్తగిరి, సర్పంచ్ కరుణమ్మ, ఈఓపీఆర్డీ షాకీర్‌అలీఖాన్, పంచాయతీ కార్యదర్శి బాబు, సచివాలయ ఉద్యోగులు వలంటీర్లు పాల్గొన్నారు.



టంగుటూరులో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



వలంటీర్లకు కిట్స్ అందిస్తున్న నాయకులు

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

గోపవరం : వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని రాచాయపేటలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. మండల ప్రత్యేకాధికారి నాగరాజ, ఈఓపీఆర్‌డీ హసీనా, అన్ని శాఖల అధికారులు పాల్గొని కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలను వివరించారు. ఆరోగ్యశాఖకు సంబంధించి డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి ఆయుష్మాన్ భారత్ పథకం గురించి తెలియజేశారు. అనంతరం డిజిటల్ టీవీ ప్రోగ్రామ్ ద్వారా కేంద్ర అందించే పథకాలను ప్రజలు వీక్షించారు. కార్యక్రమంలో అన్నిశాఖల సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

డ్రోన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



డ్రోన్ వాడకంపై రైతులకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

గోపవరం : కిసాన్ డ్రోన్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. గురువారం మండలంలోని రాచాయపేట రైతుభరోసా కేంద్రం ఆవరణలో డ్రోన్ ద్వారా వివిధ పంటలకు పిచికారి చేసే విధానంపై రైతులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండలానికి ఒక డ్రోన్ మంజూరైందని, ఇందుకోసం పైలెట్‌ను కూడా ఎంపిక చేసి డ్రోన్ ఎలా ఉపయోగించాలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అవసరమైన రైతులు ఆర్బీకేని సంప్రదించి డ్రోన్ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

స్కాలర్‌షిప్ పంపిణీ



స్కాలర్ షిప్ అందిస్తున్న ఆర్యవైశ్యసభ సభ్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మెయిన్ బజార్‌లోని శ్రీవాసవి మత్యకన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో గురువారం ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యసభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు మాట్లాడుతూ శ్రీవాసవి విద్యా సంక్షేమ నిధి ద్వారా 15 ఏళ్లుగా పేద ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతి ఏడాది స్కాలర్ షిప్‌లను అందిస్తున్నట్లు తెలిపారు. వాసవి ఆర్యవైశ్య పేదల సంక్షేమ నిధి ద్వారా పేద ఆర్యవైశ్యులకు ఆరోగ్యం కోసం సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా టెన్త్, ఇంటర్ చదువుతున్న 150 మంది విద్యార్థులకు రూ.1000 చొప్పున, డిగ్రీ, ఆపైన చదివే విద్యార్థులకు రూ.1500 చొప్పున స్కాలర్ షిప్‌లను పంపిణీ చేశారు. ఆర్యవైశ్యసభ కోశాధికారి మిట్టా శంకర్ బాబు, సహాయ కార్యదర్శి మురికి సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సాగు పనులు జోరుగా.. కొంగలకు పండుగ



లక్ష్మీపాలెం గ్రామ సమీపంలో పొలాల్లో ఆహార అన్వేషణలో ఉన్న కొంగలు

ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలకు సాగు పనులు జోరందుకున్నాయి. రైతులు తమ పొలాలను సాగుకు సిద్ధం చేసే క్రమంలో ట్రాక్టర్లతో దున్నుతున్నారు. ఈ సమయంలో ఆహార అన్వేషణలో భాగంగా గుంపులు గుంపులుగా కొంగలు పొలాలపై వాలిపోతున్నాయి. దున్నే సమయంలో మట్టి నుంచి బయటికి వచ్చే పురుగులు, ఇతర వ్యర్థాలను ఆరగిస్తూ తమ కడుపు నింపుకుంటున్నాయి. పచ్చని పొలాల్లో తెల్లని విత్తనాలు లాగా కొంగల గుంపు చూపరులను ఆకట్టుకుంటోంది. బద్వేలు మండల పరిధిలోని అనంతరాజుపురం పంచాయతీ లక్ష్మీపాలెం గ్రామ సమీపంలో గురువారం ఈ దృశ్యాలు కనిపించాయి.

– బద్వేలు అర్బన్

బ్రహ్మానంద భరితం.. భక్తుల కొంగుబంగారం

- ఆధ్యాత్మిక పరిమళం వెదజల్లుతున్న 108 శివలింగాల ఆలయం



ఆలయంలో అలంకరించిన 108 శివలింగాలు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న శివపార్వతులు

బి.కోడూరు : బద్వేలు నియోజకవర్గ చరిత్ర అత్యంత ప్రాచీనమైనది. ఇక్కడ నిర్మించిన పురాతన శివాలయాలు ఎంతో మహోన్నతమైనవి, మహిమలు కలవని పెద్దలు చెబుతారు. ఇవన్నీ ఒక ఎత్తయితే జిల్లాలో ఎక్కడా లేని విధంగా బి.కోడూరు మండలంలోని మేకవారిపల్లె గ్రామ సమీపాన గల శ్రీశ్రీశ్రీ అఖిలాండకోటి బ్రహ్మానంద ఆశ్రమంలో వెలసిన 108 శివలింగాల ఆలయం. ఈ ఆశ్రమాన్ని 1993లో రిటైర్డ్ ఉద్యోగి అయిన చంద్రశేఖర్ స్థాపించారు. ఆయనకు అర్చకుడు నారాయణస్వామి తోడవడంతో ఈ ఆలయం దినదినాభివృద్ధి చెందింది. ఆశ్రమంలో తెల్లజిల్లెడు, తులసి, వేప, శివుడికి ప్రీతిపాత్రమైన మారేడు చెట్టుతో పాటు జివ్వి, రావిచెట్లు కలిసి మొలిచాయి. అంతే కాక ఆహ్లాదకర వాతావరణం, సుందర ప్రదేశమైన ఆశ్రమంలో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతోందీ ఆలయం.

చూపరులను ఆకట్టుకుంటున్న సహస్ర నామ శివలింగం

ఈ ఆలయంలో 108 శివలింగాలతో పాటు ప్రత్యేకంగా సహస్రనామ శివలింగం భక్తులను ఆకట్టుకుంటోంది. ఒకే శివలింగంపై వెయ్యి శివలింగాల ప్రతిమలను చెక్కారు. దీంతో సహస్రనామ శివలింగం విశిష్టత సంతరించుకోవడంతో పాటు భక్తులు ప్రత్యేకంగా వచ్చి దర్శనం చేసుకుంటున్నారు. ఈ ఆలయాన్ని దర్శించుకునేందుకు జిల్లాల నుంచే కాక వివిధ ప్రాంతాల భక్తులు కూడా వచ్చి దర్శనం చేసుకుంటున్నారు. ఈ ఆలయ ప్రాంగణం ఆరుబయట ఉండటంతో పాటు భక్తులు సేదతీరడానికి ఆహ్లాదకరమైన వాతావరణం కలిగి ఉంది. చల్లని చెట్లు, పూజలు చేసుకునేందుకు అనుకూలమైన ప్రదేశం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. ప్రస్తుతం కార్తీకమాసం కావడంతో భక్తుల రాక మరింత పెరిగింది.

30 అడుగుల భారీ శివలింగం

ఈ ఆలయంలో 30 అడుగుల భారీ శివలింగాన్ని పెద్దగా ప్రతిష్టించి దాని చుట్టూ 108 శివలింగాలను మూడు వరుసలుగా ఏర్పాటు చేశారు. ఇక్కడ శివలింగాలతో పాటు సుమారు 20 అడుగుల నంది విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అలాగే ఆలయంలో సాయిబాబా, దత్తాత్రేయ, సత్య నారాయణస్వామి ఆలయాలతో పాటు నాగులపుట్ట, నవగ్రహాలు, శ్రీకృష్ణభగవానుని విగ్రహాలు, నిలువెత్తు ఆంజనేయ స్వామి విగ్రహం ఉన్నాయి.

ఈ ఆలయానికి చేరాలంటే..

ఈ ఆలయానికి భక్తులు చేరుకోవాలంటే బద్వేలు, పోరుమామిళ్ల నుండి వచ్చే భక్తులు మార్గమధ్యంలో గల మొద్దుచింతమాను మీదుగా మేకవారిపల్లె వద్ద గల 108 శివలింగాల ఆలయానికి చేరుకోవచ్చు.